RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే QUICK TODAY

బుధవారం 12 మార్చి 2025 quicktodaynews.com



# భూకబ్జాలు ఇంకెన్నాళ్లు?

**బోడుప్పల్ 12, 13 డివిజన్లలో అడ్డగోలుగా ప్రభుత్వ భూముల ఆక్రమణ**

**బీఆర్ఎస్ పాలనలో కాపాడితే ఇప్పుడు అక్రమ నిర్మాణాలు**

**పేదలను మోసం చేస్తున్న దళారులు**

**కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న అధికారులు**

**పలు అనుమానాలకు తావిస్తున్న రెవెన్యూ అధికారుల తీరు**

**ఇప్పటికైనా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి**

**బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, 12వ డివిజన్ ఇన్‌చార్జి చంటి శ్రీనివాస్**





**బోడుప్పల్, మార్చి 11 (క్విక్ టుడే న్యూస్):**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12, 13వ డివిజన్లలో ఉన్న సర్వే నెంబర్లు 63/1, 63/28 నుండి 63/39 వరకు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, 12వ డివిజన్ ఇన్‌చార్జి చంటి శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం గౌతంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్, గౌతంనగర్, అంబేద్కర్ నగర్ లోని ప్రభుత్వ భూముల్లో ఇటీవల అక్రమ నిర్మాణాలు జోరుగా వెలుస్తున్నాయని తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్న దళారులు అమాయక పేదలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు కూడా కబ్జాకోరులకు కొమ్ముకాస్తున్నారనే అనుమానాలు వస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఈ భూములను బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాపాడితే కాంగ్రెస్ ప్రభుత్వంలో కొల్లగొడుత ున్నారని ఆరోపించారు. ఈ ఆక్రమ నిర్మాణాలపై తహసీల్దార్, ఆర్‌డీవో, కలెక్టర్ సహా ప్రజావాణిలోనూ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా ఈ ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ఆక్రమణల వెనుక అధికారుల హస్తం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఈ భూములను కాపాడాలని ఇంకా ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని వెల్లడించారు. ఇటీవల దేవేందర్ నగర్‌లోని సర్వే నెంబర్ 26/1 లోని ప్రభుత్వ పాఠశాలకు ఆనుకుని ఉన్న 1200 చ.గజాల స్థలాన్ని దళారులు కబ్జా చేసి గుడిసెలు వేసినట్లు తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా ఓవైపు అధికారులు కూల్చివేస్తుండగా మరోవైపు కబ్జాదారులు గుడిసెలు వేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఈ భూమిని స్వాధీనం చేసుకొని ప్రజాప్రయోజనాల కోసం వినియోగించాలని కోరారు. గుడిసెలు వేసి రాత్రికి రాత్రే శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని వెల్లడించారు. దళారుల కారణంగా అమాయక పేద ప్రజలు ఎక్కడి నుంచో వచ్చి భూములను కొనుగోలు చేస్తూ మోసపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యతను అధికారులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశం అనంతరం ఇటీవల ప్రభుత్వ భూముల్లో అక్రమంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను చూపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బోడగళ్ల సదానంద్,12వ డివిజన్ అధ్యక్షుడు తాండూరి శివకుమార్,యువజన నాయకులు చిన్నింగళ్ళ సంతోష్,మైసగళ్ళ శ్రీకాంత్,మీసాల అర్జున్,చంటిశివ,బొల్లం శశి,తదితరులు పాల్గొన్నారు.





## టీటీడీలో చేతివాటం.. ఉద్యోగి సస్పెన్షన్

**తిరుపతి, మార్చి11(క్విక్ టుడే న్యూస్):**



విరాళాలుగా భక్తులు ఇస్తున్న కానుకలను టీటీడీలో పని చేస్తున్న కొంతమంది ఉద్యోగులు పక్కదారి పట్టిస్తున్నారు. దీంతో టీటీడీకి చెడ్డపేరు వస్తోంది. తాజాగా చెన్నైలో టీటీడీ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడు. టీటీడీకి చెందిన ఆలయ పరకామణిలో జరిగిన చోరీ ఇప్పుడు కలకలం సృష్టిస్తోంది. ఏకంగా శ్రీవారి హుండీలోనే దొంగతనానికి సదరు ఉద్యోగి పాల్పడ్డాడు. శ్రీవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల్లో టీటీడీ సీనియర్ ఉద్యోగి కృష్ణకుమార్ చేతివాటం చూపించాడు. విదేశీ కరెన్సీ రూపంలో స్వామివారికి భక్తులు కానుకలు అందజేశారు. ఇందులో సదరు ఉద్యోగి భారీగా అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆ కరెన్సీ లెక్కపెడుతుండగా భారీగా అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. కరెన్సీ లెక్కింపులో భారీగా తేడాలు ఉన్నట్లు ఆలయ అధికారులు గుర్తించారు. ఘటన బయటకు రావడంతో దొంగతనానికి సంబంధించి టీటీడీ ఈవో శ్యామలరావుకు కమిటీ నివేదిక సమర్పించింది. టీటీడీ ఈవో ఆదేశాల మేరకు కృష్ణకుమార్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఇటీవల శ్రీవారి దర్శన బ్లాక్ టికెట్ల దందా గుట్టురట్టయిన విషయం తెలిసిందే. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు బ్లాక్‌లో అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. టీటీడీ ఆస్తులను భద్రంగా ఉంచాలని శ్రీవారి భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలోనే**

# ప్రభుత్వ భూములు కబ్జా


**ప్రభుత్వ భూమిలో నిర్మించిన చర్చిని ప్రారంభించిన కాంగ్రెస్ నేతలు**

**కబ్జాదారులకు కాంగ్రెస్ నేతలే సహకరిస్తున్నారని ఆరోపించిన బీఆర్ఎస్ నాయకులు**

**పలువురిని ఆశ్చర్యానికి గురిచేసిన శిలాఫలకం**

**బోడుప్పల్ పాలకవర్గం గడువు ముగిసి పోయినా తాజాగా పేర్లు**





**బోడుప్పల్, మార్చి 11 (క్విక్ టుడే న్యూస్):**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12, 13వ డివిజన్లలోని సర్వే నెంబర్లు 63/1, 63/28 నుండి 63/39 వరకు ప్రభుత్వ భూములు కాంగ్రెస్ నాయకులు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలోనే కబ్జాలకు గురవుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. దేవేందర్ నగర్‌లో అక్రమంగా నిర్మించిన చర్చిని మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికార పార్టీది కాదా అని ప్రశ్నించారు. వివరాల్లోకి వెళితే.. దేవేందర్ నగర్ లోని డబుల్ బెడ్రూం ఇళ్లకు సమీపంలోని ప్రభుత్వ స్థలంలో కొన్నేళ్ల క్రితం ఇక్కడ చర్చిని నిర్మించారు. అయితే ఈ చర్చికి ఆనుకుని మరింత స్థలం ఉండగా దానిని ఇటీవల చర్చి పెద్దలు కబ్జా చేసి ఆక్రమంగా నిర్మాణం చేపట్టారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు నిర్మాణాన్ని కూల్చివేసేందుకు రాగా అక్కడున్న మహిళలు అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. కాగా ఈ అ క్రమ నిర్మాణాన్ని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు దానగళ్ల యాదగిరి, బొమ్మక్ కల్యాణ్ తదితరులు హాజరై ప్రారంభించారు. ఈ శిలాఫలకం పైన కూడా ఇప్పటి తాజా పాలకవర్గం పేరు ఉండడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే కాంగ్రెస్ నాయకుల తీరుపై బీఆర్ఎస్ నాయకులు బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, 12వ డివిజన్ ఇన్‌చార్జి చంటి శ్రీనివాస్, సదానందం తదితరులు తప్పుబట్టారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికార పార్టీ నాయకులే అక్రమార్కులకు సహకరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులే కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. పాలకవర్గం ముగిసినప్పటికీ మళ్లీ శిలాఫలకంలో వారి పేర్లే ఉండడాన్ని తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బోడగళ్ల సదానంద్,12వ డివిజన్ అధ్యక్షుడు తాండూరి శివకుమార్, యువజన నాయకులు చిన్నింగళ్ళ సంతోష్, మైసగళ్ళ శ్రీకాంత్, మీసాల అర్జున్, చంటిశివ, బొల్లం శశి, తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష గడువు పొడిగింపు

హైదరాబాద్, మార్చి11 (క్విక్ టుడే న్యూస్):

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీల కేటగిరి 2 పీహెచ్‌డీ సీట్ల భర్తీకి నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసేందుకు గడువును పొడిగించినట్లు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. రూ. 2000 అపరాధ రుసుముతో ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చేనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

## కాంగ్రెస్ సోషల్ మీడియా దుష్ప్రచారం

### మండిపడ్డ బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, మార్చి11 (క్విక్ టుడే న్యూస్):



కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నా రాజకీయ భవిష్యత్‌పై గత రెండు రోజులుగా కాంగ్రెస్ సోషల్ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ చిల్లర వేషాలు మానుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆర్ఎస్పీ హెచ్చరించారు.నేను రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానో, ఏ వర్గాల భవిష్యత్ కోసం పనిచేయాల్నో నాకు క్లారిటీ ఉందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మీ లాగా పదవులకోసం ఢల్లీకి మూటలు మోసే సంస్కృతి నాకు లేదు. అన్ని పైసలు కూడా నా దగ్గర లేవు. తెలంగాణలో తరతరాలుగా అణచివేతకు గురైన వర్గాల విముక్తికి కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ పార్టీ సరైన వేదిక అని బలంగా నమ్మి ముందుకు వెళ్తున్నానని పేర్కొన్నారు. రేపు బీఆర్ఎస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చిన తరువాత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రోత్సాహంతో తెలంగాణ 2.0ను ఎలా సృష్టించాలన్న పనిలో బిజీగా ఉన్నానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

## నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం: ఏలేటి

హైదరాబాద్, మార్చి11 (క్విక్ టుడే న్యూస్):

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బిజెపి క్రియాశీల పాత్రపోషిస్తుందని బిజెపి స్పష్టం చేసింది. గవర్నర్ ప్రసంగంలో మంచిచెడులను విశ్లేషించి స్పందిస్తామని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మాట్లాడుతూ.. గడిచిన డిసెంబర్‌లో మొదటి సారి గవర్నర్ ప్రసంగంలోని అంశాల ఆధారంగా సీఎం రేవంత్ రెడ్డి సంగతి తేలుస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం మీద నెపం తెచ్చే ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలపై మాట్లాడాలన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ..అంతకు ముందు కాళేశ్వరం మీద అఖిల పక్షం టూర్ పెట్టారని.. ఇప్పుడు ప్రభుత్వానికి ధైర్యం ఉంటే రాష్ట్రంలో 12 వేలకు పైగా గ్రామాల్లో ప్రభుత్వ పనితనంపై అఖిల పక్షం టూర్ పెట్టాలని.. తాము వస్తామని అన్నారు. ఫామ్ హౌస్‌లో పడుకున్న వాళ్ళ గురించి తాము మాట్లాడమని పరోక్షంగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కరెంటు, నీళ్లు, విద్య, ఉద్యోగం, రైతాంగం, మహిళలు, నిరుద్యోగ యువత, సంక్షేమ పథకాలపై ప్రతి పక్ష పార్టీగా తామే మాట్లాడతామని అన్నారు. రాష్ట్రం విడిపోక ముందు రూ 800 కోట్లు ఉంటే 2014 తరువాత రూ. 5 వేల కోట్లకు కేటాయింపులు పెరిగాయన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రి అయ్యాక ఎన్ని వేల కోట్లు అప్పులు చేసారో చర్చిద్దామని అన్నారు.

## టీటీడీ అన్నప్రసాద ట్రస్ట్‌కు భారీ స్పందన

### 2200 కోట్లు దాటిన విరాళాల మొత్తం

తిరుమల, మార్చి11 (క్విక్ టుడే న్యూస్):

తిరుమల తిరుపతి దేవస్థానం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న ఎస్వీ అన్నప్రసాద ట్రస్ట్‌కు విరాళాలు రూ.2,200 కోట్లు దాటాయని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. 1985లో తిరుమలలో అన్నదాన పథకాన్ని నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రారంభించారు. 2014లో శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్ట్‌గా తితిదే పేరు మార్చింది. నాడు 2వేల మందితో ప్రారంభమై .. ప్రస్తుతం రోజుకు లక్ష మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసే స్థాయికి ట్రస్ట్ అభివృద్ధి చెందింది. ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కు దాదాపు 9.7లక్షల మంది దాతలు ఉన్నారు. వీరిలో రూ.కోటి.. అంతకంటే ఎక్కువ మొత్తం విరాళాలు ఇచ్చిన దాతల సంఖ్య 139. తిరుమలలో ఒక్క రోజు అన్నప్రసాద వితరణకు అయ్యే ఖర్చు రూ.44 లక్షలు. కాగా.. ఇప్పటి వరకు 249 మంది దాతలు రూ.44లక్షల చొప్పున విరాళం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరుమలలో అన్న ప్రసాదంపై తితిదే ప్రత్యేక దృష్టి సారించింది. భక్తులకు మరింత రుచిగా, శుచిగా అన్న ప్రసాదం వితరణ చేస్తున్నాం. భోజనం మెనూలో వడలను కూడా వడ్డిస్తున్నారు. తితిదే అందిస్తోన్న అన్నప్రసాదంపై భక్తులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు అని బీఆర్ నాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## లెక్చరర్లకు నేడు నియామకపత్రాలు

### రవీంద్రభారతిలో అందించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి11(క్విక్ టుడే న్యూస్):

జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి మార్చి 12న బుధవారం నియామక పత్రాలు ఇవ్వనున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు 1,292 మంది, పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులకు 240 మందిని ఇటీవల టీజీపీఎస్సీ ఎంపిక చేసింది. కొత్తగా నియమితులైన లెక్చరర్లకు విద్యా శాఖ విధానాలు, బోధన పద్ధతులపై శిక్షణ ఇచ్చి కాలేజీల్లో పోస్టింగులు ఇవ్వనున్నట్లు విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా తెలిపారు. .

## అగ్నిప్రమాదాల నివారణకు పెద్దపీట

### అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టిన మంత్రి గొట్టిపాటి

అమరావతి, మార్చి11 (క్విక్ టుడే న్యూస్):

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పట్టణీకరణ, బహుళ అంతస్తుల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ఎపి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. లిఫ్టులు, ఎస్కలేటర్ల బిల్లు 2025ను అసెంబ్లీలో గొట్టిపాటి రవి ప్రవేశ పెట్టారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజల భద్రత చాలా కీలకమని అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా ఇప్పటికే కేంద్రం బిల్లు తీసుకొచ్చిందని అన్నారు. 15 రాష్ట్రాలు ఇప్పటికే లిఫ్టులు, ఎస్కలేటర్ల చట్టం అమలు చేస్తున్నాయని తెలిపారు. పూర్తి అధ్యయనం తర్వాత ఈ బిల్లును చట్టసభలో ప్రవేశ పెడతామని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలను నిలిపివేయాలి

### ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్ కు ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టం తేవాలి

### ఎమ్మార్పీఎస్ , ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ అధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు



భువనగిరి, మార్చి 11 (క్విక్ టుడే న్యూస్):

ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణం లో ఎమ్మార్పీఎస్ , ఎంఎస్పి యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ అధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన దళిత ఐక్య వేదిక ఛైర్మన్ భట్టు రాంచంద్రయ్యమాదిగ మాట్లాడుతూ "గత నోటిఫికేషన్లకు వర్గీకరణ వర్తింపజేస్తామని ఆగస్టు 1 న అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని రూపొందించి ( రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్ ఆక్ట్ ,2000) , ఆ చట్టంలో గతంలో ఇచ్చిన ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్ కు వర్గీకరణ సూత్రం వర్తింపజేసేలా 4 వ నిబంధనను పొందుపరిచారు. దాని వల్ల ఆనాడు మాదిగ నిరుద్యోగులకు ఎంతో మేలు జరిగిందని అన్నారు. ఇప్పుడు ఆ చట్టాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పరిశీలన చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎస్సీ వర్గీకరణ చట్టం వస్తుందని చెప్తూనే మరోవైపు చట్టం రాకముందే ఉద్యోగ పరీక్ష ఫలితాలు విడుదల చేయడం మాదిగలకు ద్రోహం చేయడమే అని అన్నారు. గ్రూప్ -1,2,3, ఎక్స్ టెన్షన్ ఆఫీసర్స్ అన్ని ఉద్యోగ ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మాలల కోసం మాదిగలకు అన్యాయం చేస్తున్న రేవంత్ ప్రభుత్వం తగిన రాజకీయ మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. మాదిగలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఎదుర్కోవడానికి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు కొనసాగుతున్నాయని ,తరువాత శాంతియుతంగా ధర్నాలు , రాస్తారోకోలు, ఎమ్మార్వో, కలెక్టర్ కార్యాలయల ముట్టడిలు చేపడతామని అన్నారు. ఈ దీక్షల్లోయం యస్ పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పియస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ, ఎమ్మార్పియస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, యం యస్ పీ జిల్లా నాయకులు దుబ్బ దానయ్య మాదిగ, బొట్ల దేవదాస్ మాదిగ, ఎమ్మార్పియస్ జిల్లా కార్యదర్శి నల్ల స్వామి మాదిగ, మైలారం జంగయ్య మాదిగ, భట్టు మహేందర్ మాదిగ, యం యస్ ఎఫ్ నాయకులు గంధమల్ల మధు మాదిగల తో పాటు పలువురు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు పూట్కూరి అశోక్ గౌడ్, బీ ఆర్ యస్ మండల అధ్యక్షులు జనగాం పాండు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కోళ్ల భిక్షపతి, బీజేపీ పట్టణ అధ్యక్షులు రత్నపురం బాలరాజు, బీ ఆర్ యస్ పట్టణ నాయకులు సుర్పంగా సుభాష్,బహుజన నాయకులు గంధమల్ల అశోక్, గంధమల్ల జహంగీర్, అల్లంపల్లి వెంకటేశ్వర్లు, విద్యావేత్త కడియం శ్రీనివాస్ బైండ్ల, బీజేపీ దళిత మోర్చా అధ్యక్షులు బుగ్గ దేవేందర్, యల్ ఎచ్ పియస్ నాయకులు సంతోష్ నాయక్ లు తమ సంఘీభావాన్ని తెలిపారు.

## మిర్చి రైతును పరామర్శించిన సీపీఐ నాయకులు అయోధ్య

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మార్చి 11 (క్విక్ టు డే న్యూస్):




పినపాక మండలం వెంకట్రావు పేట గ్రామానికి చెందిన మిర్చి రైతు పురుషోత్తం మిర్చి తోటకు నిప్పు పెట్టిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య చారి మంగళవారం డిమాండ్ చేశారు. పోరుషోత్తం తన పొలంలో సుమారు ఆరు ఎకరాల్లో మిర్చి పంటనువేసి సాగు పంట పండించి చేతికొచ్చి ,కోసి మిర్చి ఎండబెడితే కొందరు దొంగచాటుగా మిర్చి పంటను సుమారు, 70 క్వింటాలల పంటకు నిప్పు పెట్టి తగల బెట్టారనీ, ఇది దుర్మార్గపు చర్యఅని అన్నారు. రైతును ఈ విధంగా ఏడిపించడం మంచి పద్ధతి కాదని అన్నారు. ఈ సందర్భంగా వెంకట రావుపేట గ్రామాన్ని సందర్శించారు. పంటపై ప్రభుత్వ అధికారులు సర్వే చేసి ప్రభుత్వ నుండి నష్టపరిహారం వచ్చేలా చర్యలు చేపట్టాలని, మిర్చి పంట తగలబెట్టిన దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని, మరల ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, జిల్లా సమితి సభ్యులు గడ్డ మనోహరచారి, పత్తిపాటి నాగేశ్వరరావు మాజీ ఎంపీటీసీ కామిశెట్టి రామారావు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం ఎత్తును తగ్గించరాదు

### ఎత్తు తగ్గిస్తే స్టోరేజీ కెపాసిటీ తగ్గుతుంది

### లోక్‌సభలో ఎంపీ గురుమూర్తి ప్రస్తావన

న్యూఢిల్లీ, మార్చి11:



పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు, బడ్జెట్ లో పోలవరంకు కేటాయించిన నిధులు, పెరిగిన పోలవరం ప్రాజెక్టు ఖర్చు, విద్యారంగం తదితర అంశాలపై వైఎస్సార్‌సీపీ తన గళం వినిపించింది. ఉభయ సభల్లోనూ వైఎస్సార్‌సీపీ ఎంపీలు కొన్ని కీలకాంశాలు లేవనెత్తారు. మంగళవారం పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ గురుమూర్తి.. లోక్‌సభలో మాట్లాడుతూ.. 'పోలవరం ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు తగ్గించారు. పోలవరం ఎత్తు తగ్గించడం వల్ల స్టోరేజ్ కెపాసిటీ 194 నుంచి కేవలం 115 టీఎంసీలకే పరిమితమవుతుంది. దీనివల్ల సాగునీరు, తాగు నీటికి , విద్యుత్తు ఉత్పత్తి పైన తీవ్ర ప్రభావం పడుతుంది. ఒరిజినల్ పోలవరం డ్యాం ఎత్తు ప్రకారమే నిర్మించాలన్నారు. ఇటీవలబడ్జెట్‌లో పోలవరంకు అరకొరగా రూ. 5936 కోట్లు మాత్రమే కేటాయించారు. పెరిగిన పోలవరం ఖర్చును ఎవరు భరిస్తారు?, పోలవరం సిఈఓ ఆఫీస్ ను ఏపీకి తరలించాలి. ఏపీలో 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతులు తీసుకుంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం లేఖతో కడప మెడికల్ కాలేజీ పర్మిషన్ ను ఉపసంహరించారు. మౌలిక వసతులు లేవనే రాష్ట్ర ప్రభుత్వం లేఖతో ..మెడికల్ కాలేజీలకు పర్మిషన్ వెనక్కి తీసుకోవడం చరిత్రలో ఇదే తొలిసారి. 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయకూడదు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తారా లేదన్న అంశంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలి. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు ఇస్తారా లేదో చెప్పాలి. దుగ్గరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి. విభజన చట్టం ప్రకారం ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి. ఇప్పటివరకు ఈ హామీని నిలుపుకోకపోవడం ప్రజలను మోసం చేయడమే. అప్పులను ఎవరు చెల్లిస్తారనేది స్పష్టం చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు.

## ఈ నెల 20లోగా ఐగాట్ కర్మయోగి కోర్సుల పూర్తి

### స్వీయ అభ్యసనంతో సమర్థవంతంగా విధుల నిర్వహణ

### అధికారులకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచన

విజయవాడ, మార్చి11(క్విక్ టుడే న్యూస్):



ఆధునికతకు, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులు సమర్థవంతంగా సేవలందించాలన్నా.. భవిష్యత్తు కార్యాచరణకు సర్వసన్నద్ధంగా ఉండాలన్నా నిరంతర అభ్యసన అవసరమని.. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ శాఖ కర్మయోగి భారత్ ద్వారా అందించే ఆన్‌లైన్ కోర్సులను ఈ నెల 20వ తేదీలోగా పూర్తిచేసి, సర్టిఫికెట్లు పొందాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ.. ఏపీఎస్డీపీఎస్ సీనియర్ సలహాదారు ఎం.వెంకటేశ్వరస్వామితో కలిసి ఐగాట్ కర్మయోగి కోర్సులపై వివిధ శాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాను కూడా ఇటీవల మూడు కోర్సులను పూర్తిచేయడం జరిగిందని.. జిల్లా పరిధిలోని అన్ని శాఖల ఉద్యోగులు, సిబ్బంది ఈ కోర్సులను పూర్తి చేయాలన్నారు.మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని కూడా ఈ కోర్సులు పూర్తిచేయొచ్చని తెలిపారు. ఓ ప్రభుత్వ ఉద్యోగి కర్మచారి నుంచి కర్మయోగిగా మారి సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు వీలుకల్పించే ఆన్‌లైన్ స్వీయ అభ్యసన సర్టిఫికెట్ కోర్సుల వివరాలను వెంకటేశ్వరస్వామి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ మూడు కోర్సులను 90 నిమిషాల వ్యవధిలో చాలా తేలిగ్గా పూర్తిచేయడం ద్వారా కర్మ పాయింట్లు సాధించవచ్చని, ఉత్తమ ప్రతిభ చూపిన కర్మచారిలకు రాష్ట్ర ప్రభుత్వం బ్యాడ్జెట్స్, రివార్డులు, సర్టిఫికేట్లతో పాటు గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా నగదు బహుమతి కూడా ఉంటుందని వివరించారు. ఏపీఎస్డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలపర్తి వెంకటేశ్వరరావు మార్గనిర్దేశకత్వంతో కోర్సుల పూర్తికి ఉద్యోగులకు సహాయసహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే QUICK TODAY

బుధవారం 12 మార్చి 2025 quicktodaynews.com



## బగలాముఖీ శక్తిపీఠంలో అమ్మవారికి మహాపూజలు

**శివ్వంపేట మార్చి 11 (క్విక్ టు డే న్యూస్):**



దేశంలోనే ఎక్కడ లేని విదంగా ప్రపంచంలో ఎక్కడ లేని విదంగా మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో దాతల సహకారంతో బగలాముఖీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మితమై, ప్రతి నిత్యం భక్తులకు దర్శనమిస్తున్న శ్రీబగ లాముఖీ శక్తిపీఠంలో బగలాముఖీ అమ్మవారికి ప్రీతిపాత్రమైన మంగళవారం ఉదయం అమ్మవారికి మహాపూజలు నిర్వహించడం జరిగినది. అమ్మవారి ఉపాసకులు, బ్రహ్మర్శి శాస్త్రులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని పీతవర్ణ పుష్పాలు, పీతవర్ణ వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి, అమ్మవారికి రుద్రయామల బగలా అష్టోత్తర నామ ర్చనలతో హరిద్రార్చన కార్యక్రమం నిర్వహించి, అమ్మవారికి అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించి, నానా విధఫలాలతో నైవేద్యం సమర్పించడం జరిగినది. తనను నమ్మిన భక్తుల ప్రతిభం దకాలను తొలగించే బగలాముఖీ అమ్మవారి దర్శనం చేసుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అమ్మవారి భక్తులకు కొడకంచి సుదర్శన్ గౌడ్ పులిహోర ప్రసాదం అందజేశారు.

## కాశ్మీర్‌లో రెండు తీవ్రవాద సంస్థలపై నిషేధం

### ఉత్తర్వులు జారీచేసిన కేంద్రహోంశాఖ

**న్యూఢిల్లీ, మార్చి11:**

జమ్మూ కశ్మీర్ కేంద్రంగా పనిచేస్తున్న రెండు సంస్థలపై కేంద్ర హోంశాఖ కొరడా రaలిపించింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఆ రెండు సంస్థలపై ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తున్నట్టు వేర్వేరు ప్రకటనల్లో తెలిపింది. అవామి యాక్షన్ కమిటీ , జమ్మూకశ్మీర్ ఇత్తిహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎఓ) సంస్థలను చట్టవ్య తిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద నిషేధిత సంస్థలుగా ప్రకటిస్తున్నట్టు పేర్కొంది. అవామీ యాక్షన్ కమిటీకి ఉమర్ ఫరూక్ సారథ్యం వహిస్తుండగా, జేకేఐఎంకు మసూర్ అబ్బాస్ సారథ్యం వహిస్తున్నారు. ఏఏసీ, జేకేఐఎంలు జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తూ భారత వ్యతిరేక ప్రచారం సాగిస్తు న్నాయని ఎంహెచ్ఏ అధికారిక ప్రకటనలో పేర్కొంది. సాయుధ చొరబాట్లు, అంశాంతి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అశాంతి రెచ్చగొడుతున్నట్టు తెలిపింది. జాతి వ్యతిరేక ప్రసంగాల చేయడం, హింసను ప్రేరేపించడం, రాళ్లు రువ్వడం వంటి ఘనటనల్లో ఉమర్ ఫరూక్, ఇతర సభ్యుల ప్రేమయంపై అనేక కేసులు నమోదుకా వడాన్ని ప్రస్తావించింది. మసూర్ అబ్బాస్ నేతృత్వంలోని జేకేఐఎం జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తూ, భారత వ్యత్రిరేక ప్రచారం, ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తోందని తెలిపింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల కోసం ఆ సంస్థ సభ్యులు నిధులు సేకరిస్తున్నటు పేర్కొంది. ఆయా కారణాల దృష్ట్యా 1967 చట్ట వ్యతిరేక కార్య కలాపాల నిరోధక చట్టం కింద రెండు సంస్థలపైన ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తున్నట్టు ఎంహెచ్ఏ స్పష్టం చేసింది.

## కమాండెంట్ గంగారం మృతి

### కేటీఆర్ తీవ్ర సంతాంపం

**సిరిసిల్ల, మార్చి11(క్విక్ టుడే న్యూస్):**

తెలంగాణ సచివాలయ మాజీ సీఎస్ఓ, 17వ పోలీసు బెటాలియన్ కమాండెంట్ గంగారాం (58) మృతి చెందారు. లిఫ్ట్ లో పడి ఆయన దుర్మరణం చెందారు. ఈ ఘటనపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. పోలీసు శాఖకు ఉన్నతంగా సేవలందిస్తున్న గంగారాం మరణించడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ గంగారాం సోమవారం రాత్రి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి తన బ్యాచ్ మెంట్ అయిన సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి నివాసానికి వెళ్లారు. స్నేహితుడిని కలిసి తిరిగి ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో లిఫ్ట్ ఎక్కేందుకు బటన్ నొక్కగా.. డోర్ తెరచుకుంది. లిఫ్టు రాకపోయినా గేటు తెరచుకోవడంతో అది గమనించని గంగారాం మూడో అంతస్తు నుంచి గ్రౌండ్‌ప్లోర్‌లో ఉన్న లిఫ్ట్‌పై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించేలోపే గంగారాం మృతిచెందారు.<

## అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

### పాత కేసులో ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు అనుమతి

**న్యూఢిల్లీ, మార్చి11:**



ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఎదురుదెబ్బ తగిలింది. కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ 2019లో దాఖలైన పిటిషన్‌పై విచారణకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమ తించింది. మార్చి 18వ తేదీలోగా కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులను అదేశించింది. కేజ్రీవాల్, ఆప్ మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, మాజీ ద్వారక కౌన్సిలర్ నితిక శర్మ ఉద్దేశపూర్వకంగానే ప్రజా నిధులను దుర్వినియోగం చేస్తూ ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో భారీ హోర్డింగ్‌లు పెట్టారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరందరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టును కోరారు. దీనిపై అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నేహా మిట్టల్ మంగళవారం నాడు ఢిల్లీ పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. దీనికి ముందు 2022లో ఈ ఫిర్యాదును మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటు తోసిపుచ్చారు. అయితే సెషన్ కోర్టు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తూ పిటిషన్‌ను పునఃపరిశీలించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' పదేళ్ల పాలనకు బీజేపీ గండికొడుతూ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో హోర్డింగ్‌ల పేరుతో ప్రజానిధుల దుర్వినియోగంపై కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## అసైన్డ్ భూమిలో నిర్మిస్తున్న రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలి

### ఎంసీపీఐ మండల కన్వీనర్ మర్రిపెల్లి మొగిలి డిమాండ్

**కేసముద్రం, మార్చి 8 (క్విక్ టుడే న్యూస్):**




కేసముద్రం మండలం కేసముద్రం రెవెన్యూ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమి ఉన్న సర్వేనెంబర్ 399లో నిబంధనల విరుద్ధంగా రెండు రైస్ మిల్లులను నిర్మిస్తున్నారని వెంటనే రైస్మిల్ల నిర్మాణాన్ని నిలిపివేయాలని భారత మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ (MCPI) కేసముద్రం మండల కన్వీనర్ మర్రిపెల్లి మొగిలి డిమాండ్ చేశారు. ఈ మేరకు కేసముద్రం తహసిల్దార్ కార్యాలయం లో డిప్యూటీ తహసిల్దార్ ఎర్రయ్య కు మంగళవారం ఎం సి పి ఐ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎం సి పి ఐ మండల కన్వీనర్ మరిపెల్లి మొగిలి మాట్లాడుతూ కేసముద్రం మునిసిపా లిటీగా తేది 25-01-2025న ఏర్పాటైందని. ఇదే మునిసి పాలిటీలో కేసముద్రం విలేజి గ్రామపంచాయతీ విలీనం అయిందని తెలిపారు. మునిసిపాలిటీలో విలీనం అవుతున్నట్లు ముందే గ్రహించిన పంచాయతీ కార్యదర్శి, అతనికి సహకరిస్తున్న ఎన్ఎంఆర్ సిబ్బంది కలిసి గ్రామ పంచాయతీ పరిధిలో కేసముద్రం రెవెన్యూ గ్రామంలోని కోరుకొండపల్లి శివారులోని కట్టుకాల్వ ప్రాంతంలో అసైన్డ్ సర్వే నెంబరు 399 యందు రెండు రైస్ మిల్లుల నిర్మాణానికి అనుమతి ఇచ్చినట్లు ఆరోపించారు. ప్రభుత్వ అసైన్డ్ సర్వే నెంబరు భూములను అమ్మడంగాని, కొనడం గాని చేయడం నిషేధం ఉందని, అలాంటిది పలువురు వ్యాపారులు ఇట్టి అసైన్డ్ భూమిని నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసినట్లు తెలిపారు. వారికి భూమిపై ఎలాంటి హక్కులు లేకున్నప్పటికీ అసైన్డ్ భూముల్లో రైస్ మిల్లుల నిర్మాణానికి గ్రామపంచాయతీ అధికారులు అసైన్డ్ నిబంధనలకు విరుద్ధంగా అనుమతిని ఇచ్చినట్లు ఆరోపించారు. దీనిపై వెంటనే జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు, మునిసిపల్ కమీషనర్ స్పందించి అసైన్డ్ భూముల్లో అక్రమంగా నిర్మాణం అవుతున్న రైస్ మిల్లులను వెంటనే నిలిపి వేయాలని, అట్టి భూములను పేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం సి పి ఐ జిల్లా కమిటీ సభ్యుడు జాటోత్ బిచ్యా నాయక్, మండల కమిటీ సభ్యుడు ఉల్లి ప్రతాప్ పాల్గొన్నారు.

## వెటా ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు

### సమాజంలో మహిళలకు మరింత ప్రోత్సాహం అవసరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి


### మార్పు రావాలంటే మహిళల భాగస్వామ్యం పెరగాలి..నియోజకవర్గం ఇంచార్జి ఝాన్సీ రెడ్డి

**తొర్రూర్, మార్చి 11(క్విక్ టుడే న్యూస్ ):**






మండల కేంద్రంలోని రెడ్డి గార్డెన్ లో ఉమెన్ ఎంపవర్మెంట్ తెలుగు అసోసియేషన్(వెటా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఝాన్సీ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలను సన్మానించి గౌరవించారు.అదే విధంగా హాజరైన మహిళమణులకు బహుమతులను అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..... మహిళలు ఈ సమాజానికి నిలువెత్తు ప్రేరణ పురుషుల కంటే తక్కువ కాకుండా అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారన్నారు. ప్రతి మహిళ తన లక్ష్యాలను సాధించేందుకు ధైర్యంగా ముందుకెళ్లాలని, ఎలాంటి అడ్డంకులైనా ఎదుర్కొని, విజయాన్ని సాధించగలిగే సత్తా వున్న వాళ్ళు మహిళలు మాత్రమేనన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకో వాలని కోరారు.అలాగే సమాజంలో మహిళల భద్రత, ఆర్థిక స్వావలంభన, విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో మరిన్ని సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు ఆర్థికంగా,సామా జికంగా ముందుకు సాగితే దేశం అభివృద్ధి చెందుతుం దన్నారు. సభ అధ్యక్షత వహించిన వెటా ఫౌండర్ హనుమాండ్ల ఝాన్సి రెడ్డి మాట్లాడుతూ.... ఈ వేడుకను మహిళల ప్రగతికి అంకితం చేస్తూ, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని విజ్ఞప్తి



చేశారు. వెటా ఫౌండేషన్ మహిళల అభివృద్ధికి కృషి చేస్తుందని, ఔత్సాహిక మహిళలకి శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించి వారికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. సమాజంలో మార్పు రావాలంటే మహిళల భాగస్వామ్యం పెరగా లన్నారు.అందుకు కుటుంబం, సమాజం అందరూ సహకరించాలని కోరారు. భవిష్యత్తులో మహిళలకు మరింత సహాయం చేయడానికి వెటా ఫౌండేషన్ సిద్ధంగా ఉంటుందన్నారు. మహిళా సాధికారత కోసం మరిన్ని కార్యక్రమాలు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. అదే విధంగా సన్మానం పొందిన వైద్య, విద్య, క్రీడా, రాజకీయ, సేవా రంగాల్లో గుర్తింపు పొందిన మహిళలు తమ అనుభవాలను పంచుకున్నారు. సమాజంలో మహిళలకు మరింత ప్రోత్సాహం అవసరమని, పురుషులతో సమానంగా అవకాశాలు దొరకాలన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మహిళలకి పూర్తి మద్దతు ఇచ్చి స్వయం ఉపాధి, స్టార్ట్-అప్‌లు, వృత్తిపరమైన శిక్షణలో సహాయం చేయాలని కోరారు. ఇప్పటికే విజయాలు సాధించిన మహిళలు యువతకు మార్గదర్శకంగా ఉండటం ద్వారా మరెందరో స్త్రీలు ముందుకు రావచ్చని చెప్పారు. ఈ కార్యక్రమం లో మహిళా ప్రజా ప్రతినిధులు,వేట సభ్యులు, మహిళా సంఘాల మహిళలు, విద్యార్థినులు,మహిళా ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.






## డీలిమిటేషన్‌తో సీట్లు పెరుగుతాయి

### తగ్గడం అన్నది పసలేని వాదన

### స్టాలిన్ వ్యాఖ్యల నేపథ్యంలో రాజ్‌నాథ్ వివరణ

**న్యూఢిల్లీ, మార్చి11:**

నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న ఆరోప ణలను కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తోసిపుచ్చారు. పార్లమెంటు సీట్ల సంఖ్య తగ్గుతుందని జరుగుతున్న చర్చపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. డీలిమిటేషన్‌తో తమిళనాడుతో సహా అన్ని రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరు గుతుందని ఆయన అన్నారు.ఒక ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ, డీలిమిటేషన్ పక్రియ ప్రణాళికా బద్ధంగా కొనసాగుతుందని తాను భావిస్తున్నట్టు చెప్పారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌కు ఏదైనా అభ్యంతరం ఉంటే వాటిని లేవనెత్తే స్వేచ్ఛ ఆయనకు ఉంటుందని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్చలు జరుపుతారని, నిర్ణయం న్యాయంగానే ఉంటుందని చెప్పారు. aాసనసభ అయినా, లోక్‌సభ అయినా ప్రతి రాష్ట్రంలోనూ నియోజకవర్గాల పునర్వి భజన తర్వాత సీట్ల సంఖ్య సహజంగానే పెరుగుతుందని అన్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళలో కూడా సీట్లు పెరుగుతాయని, నియోజకవర్గాల పునర్వి భజన వల్ల ఉత్తరాది రాష్ట్రాలు మాత్రమే ప్రయోజనం పొందుతాయనడం సరైన వాదన

## సంక్షేమ పథకాలతో సొంత ప్రచారం

### బెల్టులు, స్కూలు బ్యాగులపైనా జగన్ బొమ్మలు

### అసెంబ్లీలో లోకేశ్ వెల్లడి

**అమరావతి, మార్చి11 (క్విక్ టుడే న్యూస్):**

సంక్షేమ పథకాలను మాజీ సీఎం జగన్ సొంత ప్రచారానికి వినియోగించుకున్నారని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సభలో లోకేశ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే పాఠ్య పుస్తకాలు, బెల్టులు, స్కూల్ బ్యాగులు.. ఇలా అన్నింటిపైనా జగన్ ఫొటోలు ప్రచురించారని మండిపడ్డారు. జగన్, వైకాపాపై లోకేశ్ వ్యాంగ్యాస్త్రాలు సంధించి.. సభలో నవ్వులు పూయించారు. గత ఐదేళ్లలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని మంత్రి లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలో 100 మంది కంటే తక్కువగా ఉన్న పాఠశాలల సంఖ్య 550 కంటే ఎక్కువగా ఉందన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వం చేతకానితనం కారణంగా పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో పదో తరగతి ఉత్తీర్ణతలో రాష్ట్రం 2 నుంచి 14వ స్థానానికి పడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి రాగానే డ్రాపవుట్‌లపై దృష్టి సారించిందని లోకేశ్ చెప్పారు. గత ప్రభుత్వం 1000 పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆడంబరంగా చెప్పింది. పాఠశాలలు, ఉపాధ్యాయులను మాత్రం సిద్ధం చేయలేదు.

RNI NO : TELTEL/2023/86487
క్విక్ టుడే
CINEMA
QUICK TODAY
quicktodaynews.com
బుధవారం 12 మార్చి 2025




## ఒడిషాలో నటి ప్రియాంక

ప్రస్తుతం ఎక్కడ చూసినా  మహేశ్ బాబు, రాజమౌళి సినిమా ముచ్చట్లే వినిపిస్తున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో స్టార్ హీరో మహేశ్ బాబు నటిస్తున్న ఈ సినిమా అప్‌డేట్స్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందులో ప్రియాంక చోప్రా కీలకపాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ నటి పంచుకుంటున్న తన అప్‌డేట్స్ క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. తాజాగా ప్రియాంక తన ఇన్‌స్టాలో కొన్ని ఫొటోలు, వీడియో పంచుకున్నారు. ఆ వీడియో చూస్తే, ఆమె ఒడిశా వెళ్లినట్లు తెలుస్తోంది. దానితో పాటు విమానం నుంచి చూస్తున్న ఓ స్టైలిష్ ఫొటోను కూడా ప్రియాంక షేర్ చేశారు.షూటింగ్ కోసమే ఆమె అక్కడకు వెళ్లినట్లు సమాచారం. మార్చి 10న విమానాశ్రయంలోని సిబ్బందితో ప్రియాంక దిగిన ఫొటో కూడా నెట్టింట వైరలైన విషయం తెలిసిందే. లార్జ్ దేన్ లైఫ్ కథలకు రాజమౌళి పెట్టింది పేరు. జక్కన్న ఏం చేసినా దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, భారీ హంగులు అద్ది ప్రేక్షకులకు అందిస్తారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో వార్త కూడా మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో రాజమౌళి కాశీ నగరాన్ని చూపనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే కాశీలో షూటింగ్ నిర్వహించడం కష్టం. దీంతో నిజంగా కాశీని తలపించేలా అద్భుతమైన సెట్ వేయనున్నారట. ఈ సినిమాలోని కీలక భాగం కాశీ పట్టణానికి సంబంధం ఉంటుందని అందుకే రాజమౌళి ఈ సెట్ వేయనున్నారని సమాచారం. అడవులు, నదులు, ఆధ్యాత్మిక నగరాలు.. ఇలా విభిన్న ప్రకృతి దృశ్యాలతో ప్రేక్షకులను ఎప్పటికీ మర్చిపోలేని సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు రాజమౌళి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



## రికార్డులు సృష్టిస్తున్న ఛావా

### బాహుబలి-2 కలెక్షన్లను అధిగమించి వసూళ్లు

విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో తెరకక్కిన 'ఛావా'రికార్డులు సృష్టిస్తోంది. ఇప్పటికే బీటౌన్‌లో ఎన్నో రికార్డులు తన ఖాతాలో వేసుకోగా.. తాజాగా మరో మైలురాయిని చేరుకుంది. సినీ ఇండస్ట్రీలో చరిత్ర సృష్టించిన 'బాహుబలి 2' రికార్డును అధిగమించింది. దీంతో విక్కీ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'బాహుబలి 2' అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినిమాకు గుర్తింపుతెచ్చింది. దేశవ్యాప్తంగానూ విడుదలైన అన్ని ప్రాంతాల్లో భారీ వసూళ్లు సొంతం చేసుకుంది. హిందీలో ఈ చిత్రం రూ.510 కోట్లు వసూళ్లు రాబట్టింది. ఇప్పుడీ కలెక్షన్లను 'ఛావా' అధిగమించింది. ఫిబ్రవరి 14న విడుదలైన 'ఛావా' ఇప్పటివరకూ బీ టౌన్‌లో రూ.516 కోట్లు వసూళ్లు చేసింది. దీంతో 25 రోజుల్లోనే బాలీవుడ్‌లో 'బాహుబలి 2' రికార్డును అధిగమించి చరిత్ర సృష్టించింది. అంతేకాదు హిందీ చలనచిత్ర చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన ఆరో సినిమాగా 'ఛావా' నిలిచింది. మరోవైపు ఈ సినిమా ఓటీటీ విడుదల గురించి సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీని డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. థియేటర్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఏప్రిల్ 11 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు వార్తలు వస్తున్నాయి . త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుందంటూ పోస్టులు షేర్ అవుతున్నాయి. ఈ చిత్రం ఓటీటీ విడుదలయ్యాక అక్కడ కూడా రికార్డులు నెలకొల్పడం ఖాయంగా కనిపిస్తోంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్ ఆయన భార్య యేసుబాయి భోంస్లే పాత్రలో రష్మిక జీవించేశారు.

## దెబ్బకొట్టిన క్లైమాక్స్ సెంటిమెంట్




సూపర్ స్టార్ మహేష్ బాబుకి టాలీవుడ్‌లో  ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువే. ఆయన సినిమాల కోసం అభిమానులు ఎప్పుడూ ఎదురు చూస్తుంటారు. ప్రస్తుతం మహేష్.. రాజమౌళితో భారీ ప్రాజెక్ట్ చేస్తుండగా, ఈ సినిమా ఎలా ఉంటుంది, ఎన్ని సంచలనాలు సృష్టిస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు.అయితే తాజాగా మహేష్ మూవీ క్లైమాక్స్‌లకి సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్ అవుతుంది. మహేష్ బాబు నటించిన బాబీ సినిమా కోసం రెండు క్లైమాక్స్‌లు షూట్ చేశారట. ఇప్పటి జనరేషన్ వాళ్లకి ఈ విషయం తెలియదు. మహేష్ బాబు, ఆర్తి అగర్వాల్ జంటగా శోభన్ దర్శకత్వంలో 2002లో బాబి సినిమా రూపొందింది. సినిమా మహేష్ నటించిన తొలి లవ్ స్టోరీ మూవీ కాగా, ఈ సినిమాకి మణిశర్మ మ్యూజిక్ అందించారు. ప్రకాష్ రాజ్, రఘువరన్, బ్రహ్మానందం, సునీల్, రవిబాబు ఇలా భారీ కాస్టింగ్ తో ఈ చిత్రాన్ని రూపొందించారు.'టక్కరి దొంగ ' లాంటి కౌబాయ్ మూవీ తరువాత మహేష్ నుండి వచ్చిన ఈ మూవీపై అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. అయితే సినిమా రిలీజ్ అయ్యాక ఫ్యాన్స్ చాలా డిజప్పాయింట్ అయ్యారు. అందుకు కారణం క్లైమాక్స్ లో మొత్తం అందరూ చనిపోతారు. హీరో మహేష్ బాబు, హీరోయిన్ ఆర్తి అగర్వాల్ కూడా పోలీస్ కాల్పుల్లో చనిపోవడంతో సినిమా ఎండ్ అయిపోతోంది. అయితే ఇది మహేష్ ఫ్యాన్స్‌ని నిరాశకు  చేసింది. పెద్ద గొడవ చేశారు. సెకండ్ షో సమయానికి డిజాస్టర్ అన్నారు. దాంతో ప్రొడక్షన్ టీం హడావుడిగా మరో చిన్న సీన్ షూట్ చేసి క్లైమాక్స్ మార్చేశారు. దాని ప్రకారం సినిమాలో ఆర్తి అగర్వాల్ తండ్రి ప్రకాష్ రాజ్ వచ్చి పోలీస్ కాల్పుల్లో గాయపడిన మహేష్ బాబు, ఆర్తి అగర్వాల్ ని హాస్పిటల్ కి తీసుకువెళ్లినట్టు చూపిస్తారు. ఇక చివరికి ఇద్దరికి పెళ్లి చేసి శుభం కార్డ్ వేస్తారు. అలా చేసిన కూడా సినిమా రిజల్ట్ మారలేదు. ఈ సినిమా రిలీజ్ అయిన మూడు నెలల గ్యాప్‌లో ఒక్కడు చిత్రం రిలీజ్ అయి మహేష్ కెరియర్‌ని పూర్తిగా మార్చి వేసింది. ఫ్యాన్స్ కు 'ఒక్కడు ' ఫుల్ మీల్స్ పెట్టేసింది. ఆ సక్సెస్ తో 'బాబీ ' గాయాన్ని మర్చిపోయారు ప్రిన్స్ అభిమానులు.



## మళ్లీ నటించేందుకు సిద్ధంగా నటి రంభ

అలనాటి నటి రంభ మరోమారు అలరించేందుకు సిద్ధమయ్యారు. త్వరలోనే తెరంగేట్రం చేసేందుకు రెడీగా ఉన్నారు.  1990ల్లో స్టార్ హీరోల సరసన నటించి మెప్పించారు నటి రంభ. ఈ నటి మరోసారి వెండి తెరపై సందడి చేయనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా తమిళ నిర్మాత ఓ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ వార్తలపై స్పందించారు. ఆమె రీ ఎంట్రీ ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌లో తమిళ నిర్మాత కలైపులి ఎస్.థాను రీ ఎంట్రీ గురించి మాట్లాడారు. 'రంభ ఆర్థికంగా సెటిల్ అయ్యారు. తన భర్త కూడా పెద్ద వ్యాపారవేత్త. ఆయన ఇటీవల నన్ను కలిసినప్పుడు రంభకు మంచి సినిమాలో అవకాశం ఇవ్వమని కోరారు. అలాంటి ప్రాజెక్ట్ ఏమైనా ఉంటే కచ్చితంగా ఆమెను సంప్రదిస్తానని అతడికి హామీ ఇచ్చాను' అని చెప్పారు. దీంతో త్వరలోనే ఈ నటి రీ ఎంట్రీ ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్ హీరోగా నటించిన 'ఆ ఒక్కటి అడక్కు' సినిమాతో టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్నారు రంభ. ఆ తర్వాత వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు సొంతం చేసుకున్నారు. అంతేకాదు.. దేశముదురు, యమదొంగ సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌లో అదరగొట్టారు. ఈ పాటలు ఇప్పటికీ ట్రెండిరగ్‌లో ఉన్నాయి. 2010లో కెనడాలో స్థిరపడిన ఇంద్రకుమార్‌ను వివాహం చేసుకున్నారు. దీంతో కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్నారు. నటనకు దూరంగా ఉంటున్నప్పటికీ పలు టీవీ డ్యాన్స్ షోలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. చివరిసారి 2008లో వెండితెరపై కనిపించారు రంభ.

**Owner, Editor, Printed & Published:** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500098. Telangana. Printed at S.A Printers, D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District, Telangana, -500098. **RNI NO TELTEL/2023/86487**, Cell: 8125972476. website: quicktodaynews.com, e-mail: quicktodaynews@gmail.com